క్లుప్తంగా

ఆమనగంటికి నివాళి



ఆమనగంటికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల హక్కులు, సమస్యలు, ప్రయోజనాల కోసం ఒక సంఘం ఉండాలని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ ఏర్పాటుకు ఆమనగంటి శ్రీరాములు కృషి చేశారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావులు అన్నారు. ఏలూరు ఇరిగేషన్ కార్యాలయంలో ఏపీఎన్‌జీవోస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆమనగంటి శ్రీరాములు 104వ జయంతిని నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరాములు అందించిన సేవలను కొనియాడారు.

భాజపాయ్ హత్యను ఖండించాలి



జర్నలిస్టు భాజపాయ్

ఏలూరు (టూటౌన్): దైనిక్ జాగరణ్ హిందీ దినపత్రిక జర్నలిస్టు రాఘవేంద్ర బాజపాయ్ హత్యని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి కొనుగోలులో స్టాంప్ డ్యూటీ ఎగవేత అంశంపై జర్నలిస్ట్ రాఘవేంద్ర అనేక కథనాలు రాశారని, ఆయన 10 ఏళ్లగా జర్నలిజంలో ఉన్నారని తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో వరుసగా జర్నలిస్టులపై దాడులు, హత్యాకాండలు జరుగుతున్నాయని వివరించారు.

కోర్టు తీర్పు అభినందనీయం

ఏలూరు (టూటౌన్): ప్రణయ్ హత్య కేసులో నిందితులకు శిక్ష విధించడాన్ని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అభినందించారు. తెలంగాణలో 2018 సెప్టెంబరు 14న మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రణయ్ పెరుమాళ్లను కులాంతర వివాహం చేసుకున్నాడని దారుణంగా హత్య చేసి చంపిన ఘటన బాధాకరమని తెలిపారు. చట్టం ఎవరికీ చుట్టం కాకుండా పనిచేస్తే, తప్పు చేసిన వ్యక్తి ఈ సమాజంలో ఎంత గొప్ప వాడైనా శిక్షార్హులే అనేదానికి ఈ తీర్పు నిదర్శనమన్నారు. నల్గొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ 2వ అదనపు కోర్టు జడ్జి తీర్పు అభినందనీయమన్నారు. ఈ హత్యలో 8 మంది ఉండగా ఒకరు చనిపోయారని, ఏ2కు ఉరిశిక్ష విధించారని తెలిపారు.

సుందరీకరణ మూణ్ణాళ్ల ముచ్చటే !

- నెల రోజులకే మూలన పడ్డ వాటర్ ఫౌంటెయిన్లు
- నిర్వహణా లోపం
- ప్రజాధనం వృథా

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర సుందరీకరణలో భాగంగా లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టిన పనులు నిరుపయోగంగా మారుతున్నాయి. స్వచ్ఛ ఏలూరు కార్యక్రమంలో భాగంగా ఏలూర నగరంలోని జూట్ మిల్లు సెంటర్, అశోక్ నగర్ సెంటర్, తంగెళ్లమూడి సెంటర్‌లలో నెలరోజుల క్రిందట ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్లు పనిచేయడంలేదు. ఇందుకు వాటి పర్యవేక్షణ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

రూ.90 లక్షలతో ఏర్పాటు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని జూట్‌మిల్లు సెంటర్, తంగెళ్లమూడి, అశోక్ నగర్ సెంటర్లలో ఒక్కోటి సుమారు రూ.30 లక్షల వ్యయంతో మొత్తం రూ.90 లక్షల ప్రజాధనం వెచ్చించి వాటర్ ఫౌంటెయిన్లు నిర్మించారు. రాతి విగ్రహాలు, బొమ్మలు వంటివి ఏర్పాటు చేసి చుట్టూ గ్రానైట్ రాళ్లు పరిచారు. లోపల వాటర్ ఫౌంటెయిన్లు ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభించిన నెల రోజులు తిరక్కుండానే పనిచేయడం మానేశాయి.



తంగెళ్లమూడి వద్ద వాటర్ ఫౌంటెయిన్



జూట్ మిల్లు సెంటర్ వద్ద వాటర్ ఫౌంటెయిన్



అశోక్‌నగర్ సెంటర్‌లోని వాటర్ ఫౌంటెయిన్

సిబ్బందిని నియమించాలి



ఏలూరు నగరాన్ని ముందుగా చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దాలి. నగర జనాభాకు అనుగుణంగా కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి. ఒక పక్క క్లాప్ ఆటోలను నిలిపి వేయడంతో ఎక్కడి చెత్త అక్కడే కన్పిస్తుంది. నగరంలో ఇన్ని సమస్యలు ఉండగా సుందరీకరణ పేరుతో ప్రజా ధనం వృథా చేయడం సరికాదు.

– డీఎన్‌వీడీ ప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

ప్రజా సమస్యలు గాలికి



నగరంలో అనేక సమస్యలు ఉండగా వాటన్నింటినీ గాలికి వదిలేశారు. ఎవరి మెప్పు కోసమో.. కాంట్రాక్టర్లు ఇచ్చే కాసుల కోసమో సుందరీకరణ పేరుతో లక్షలాది రూపాయల ప్రజా ధనంను ఇబ్బడి ముబ్బడిగా ఖర్చు చేసేస్తున్నారు. మాకు ఎదురుగా ఉన్న జూట్ మిల్లు సెంటర్‌లోని వాటర్ ఫౌంటెయిన్ అప్పుడప్పుడూ మాత్రమే పనిచేస్తుంది.

– బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ, ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

కమీషన్ల కోసమే పనులు



సుందరీకరణ పనులన్నీ కమీషన్ల కోసమే తప్ప ప్రజలకు ప్రయోజనం కావు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఆంధ్ర, చెత్త రహిత ఏలూరు నగరం పేరుతో కార్పొరేషన్ పరిధిలో పలు పనులు చేపట్టడం వరకు బాగానే ఉన్నా, ఆ పనులను పర్యవేక్షించడంలో అలసత్వం కన్పిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నివారణా చర్యలు తీసుకోవాలి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు, ఏలూరు

ఐటీఐలో నేషనల్ సేఫ్టీ వీక్



పోటీల్లో బహుమతులు అందుకున్న విజేతలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో సోమవారం లిక్సిల్ ఇండియా సానిటరీ వేర్ ప్రైవేట్ లిమిటెడ్ (భీమడోలు) ఆధ్వర్యంలో నేషనల్ సేఫ్టీ వీక్ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు పారిశ్రామిక భద్రత, భద్రతకు వినియోగించే పరికరాలపై విద్యార్థులకు అతిథి ఉపన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. ప్రాక్టికల్ డెమోల ద్వారా ఆపదలను ఎదుర్కొనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, నాటిక ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు లిక్సిల్ ఇండియా సానిటరీ వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కట్సుహికో టకేగుచి చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ పి.సుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.జితేంద్ర తదితరులు పాల్గొనగా కార్యక్రమాన్ని ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత పర్యవేక్షించారు.

హేలాపురిలో ఎడారి ఓడలు



రాజస్థాన్ ఎడారిలో కనిపించే ఎడారి ఓడ (ఒంటె)లు ఏలూరు నగరంలో సోమవారం కనువిందు చేశాయి. రాజస్థాన్‌లో పనులు లేక కొందరు వలస వచ్చి ఒంటెలపై చిన్నారులను ఎక్కించి తిప్పి కొంత సొమ్ము తీసుకుని జీవిస్తున్నారు. – సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

వెలుగు అవినీతిపై విచారణకు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): వెలుగు పథకంలో నిధుల అవినీతిపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని వెలుగు పథకంలోని నిరుపేద దళిత మహిళల కోట్లాది రూపాయలు అవినీతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, అవినీతికి పాల్పడిన వారిని చట్టప్రకారం శిక్షించేలా చూడాలని పేర్కొన్నారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని కోరారు. దళిత సేన నాయకులు బేతాళ జయసుధ, సికాకొల్లు స్టాలిన్, పింగుల ఇ.థియ, మోనూరి దేవ మాత, రేమల్లె స్వర్ణకమల, ముప్పిడి సుబ్బారావు, బీసీ సెల్ అధ్యక్షులు కొప్పుల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

ప్రభుత్వం తీరుపై జేపీ ఆగ్రహం



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న జయప్రకాష్, ముఖ్యనేతలు

ఏలూరు టౌన్: కూటమి సర్కారు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా కుట్రలు చేస్తోందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఏలూరు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత పోరు కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న ఉదయం 10 గంటలకు ఏలూరులో భారీ ఎత్తున నిరసన ర్యాలీ, ప్రదర్శన చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నామని చెప్పారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు వెళతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి కారణమైన యువత, నిరుద్యోగులు, విద్యార్థులను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీల్లో ఉద్యోగాలు కల్పించని పక్షంలో నిరుద్యోగ భృతి రూ.3వేల చెల్లిస్తామని నమ్మించి, ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నత లక్ష్యంతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించి చూపించారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి వేలకోట్లు నిధులు ఖర్చు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పేదల కుటుంబాల్లోని పిల్లల చదువులను దెబ్బతీసేలా వ్యవహరించటం సరికాదన్నారు. సమావేశంలో ముఖ్య నాయకులు నూకపెయ్యి సుధీర్‌బాబు, గంటా మోహన్‌రావు, తంగెళ్లరాము, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాతినవలస రాజేష్, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, నగర మహిళాధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడుడు బాలాజీ, మున్సిపల్ విభాగం అధ్యక్షులు అట్టాడ రామకృష్ణ, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షులు బళ్ళ రమేష్, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు వైఎస్‌పీ శివరావు, ఎంప్లాయీస్ విభాగం అధ్యక్షులు బత్తుల ప్రభాకర్‌రావు, ప్రచార విభాగం అధ్యక్షులు కొల్లిపర భగవాన్, ఎస్టీ విభాగం అధ్యక్షులు దేవరకొండ నాగేశ్వరరావు, వలంటీర్ విభాగం అధ్యక్షులు ఉయ్యాల గణేష్, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు కొవ్వాడ దుర్గారావు, చేనేత విభాగం అధ్యక్షులు కొండపల్లి పరమేశ్వరరావు, సోషల్‌మీడియా ఇన్‌చార్జి సుజన్, మేధావుల విభాగం అధ్యక్షులు ఏసుపాదం, పార్టీ సీనియర్ నాయకులు తులసీ వర్మ, గుడివాక మోహన్, తదితరులు ఉన్నారు.

నేడు జాబ్ మేళాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని జంగారెడ్డిగూడెం, తడికలపూడిల్లో ఈ నెల 11న జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎస్‌పీసీ ట్రైనింగ్ సెంటర్ (స్కిల్ హబ్)లో నిర్వహించే మేళాలో అపోలో ఫార్మసీ, పాట్లం రిటైల్ కాన్సెప్ట్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటరని, ఈ మేళాలో సుమారు 150 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 96425 98324, 96525 03799, టోల్ ఫ్రీ నెంబర్ 99888 53335లలో సంప్రదించవచ్చన్నారు.

- తడికలపూడి మహిళా ప్రాంగణం స్కిల్ హబ్‌లో నిర్వహించే జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, మోహన్ స్పిన్‌టెక్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 100 మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశలు కల్పిస్తారని తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి, 18 నుంఇ 35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90008 03414, 96663 22032లతో పాటు కమాండ్ కంట్రోల్ నంబర్స్ – 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279లలో సంప్రదించవచ్చన్నారు. ఈ జాబ్ మేళాలకు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్ళతో హాజరు కావాలని తెలిపారు.

'నెక్స్‌జెన్' ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు



అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నెక్స్‌జెన్ ఎండీ సుబ్రహ్మణ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు మండలంలోని పలు ప్రాంతాల్లో నెక్స్‌జెన్ కంపెనీ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం సహకారంతో సోమవారం రూ.47 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కాట్లంపూడిలో వాటర్ ప్లాంట్‌కు రూ.15 లక్షలు, జాలిపూడిలో రజకుల ఫంక్షన్ హాల్ అభివృద్ధికి రూ.14 లక్షలు, చాటపర్రు శివారు తిమ్మారావుగూడెంలో వాటర్ ప్లాంట్‌కు రూ.9 లక్షలు, జాలిపూడి శివారు బాబూఖాన్‌గూడెంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రహరీ నిర్మాణం, శ్రీ రామాలయం ప్రహరీ నిర్మాణాలకు రూ.9 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శిలాఫలకాలను సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ పి.మహేష్, ఎమ్మెల్యే సీహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తున్న సుబ్రహ్మణ్యాన్ని ఈ సందర్భంగా వారు సత్కరించారు.

వెదురు తడికలు మాయం



కొండపల్లి ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం నుంచి రాత్రివేళ తడికలను తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు: అటవీ శాఖాధికారులు పట్టుకున్న వెదురు తడికలను రాత్రికి రాత్రే కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే, అమరవరం అటవీరేంజ్ పరిధిలోని బర్లమడుగు గ్రామంలో ఇటీవల అటవీశాఖకు చెందిన జిల్లా అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వెదురు బొంగులను నరికి తడికలను తయారు చేసి అమ్ముతుండగా జిల్లా అధికారులు పట్టుకుని తడికలను కొండపల్లి ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం తరలించారు. కాగా వాటిని ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకు వెళ్తుండగా స్థానికులు చూసి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వారిని అడ్డుకున్నారు. కాని అప్పటికే కొన్ని తడికలను తరలించుకెళ్లినట్టు సమాచారం. తడికల తరలింపులో గతంలో అటవీశాఖలో టింపరరీగా విధులు నిర్వహించిన వ్యక్తి కీలకంగా వ్యవహరించాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా అమరవరం రేంజ్ పరిధిలో పలు ఘటనలు జరుగుతున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కళాశాలకు కుర్చీల వితరణ



కుర్చీలు అందజేసిన అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కాలేజీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ప్రతినిధులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.15,300 విలువైన 60 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 60 కుర్చీలు బహూకరించిన సందర్భంగా రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌సీటీఏ ప్రెసిడెంట్ ఎస్‌కే హుస్సేన్, సెక్రెటరీ ఎల్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఏసీ డానియేల్, కార్యవర్గ సభ్యులు ఎం రమా సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, వివిధ విభాగాల అధ్యాపకులు కె.అజయ్ కుమార్, వి.వెంకట్రావు, ఎం విజయకుమార్, ఎస్ పరమేశ, టీవీఎస్ పద్మావతి, టి.వెంకట దుర్గాప్రసాద్, పీఆర్ కావ్య శ్రీ, ఎస్ సుస్యలత, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ లోని భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యా లయం వద్ద సీపీఎం నాయ కులు ధర్నా నిర్వహించారు. ఈమేరకు ఆర్డీఓ ఆర్‌వీ రమణకు వినతిపత్రం అందజేశారు. మర్లగూడెం, ఇనుమూరు, జైనవారిగూడెం, సిరివారిగూడెం గ్రామాల పరిధిలో 150 ఎకరాలకు పైగా ఉన్న ఎల్‌టీఆర్ భూములను 25 ఏళ్లగా గిరిజనులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములకు సంబంధించి అధికారులు, పోలీసులతో పాటు ఎమ్మెల్యే సైతం భూస్వాముల వైపు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. బుట్టాయిగూడెంలోని ఇళ్లస్థలాలకు సర్వేచేసి ప్రభుత్వ భూమి గిరిజనులకు అప్పజెప్పాలని అధికారులను ఆదేశించినప్పటికీ కనీసం ఇప్పటి వరకు బుట్టాయిగూడెం తహసీల్దార్ కనీసం అటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. ఏజెన్సీ భూసమస్యలు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్‌లో ప్రేరణ-25

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు సోమవారం ప్రేరణ–25 పేరుతో మేనేజిమెంట్ మీట్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సుమారు 20 కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని, స్టాల్స్ ఏర్పాటు చేశారని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, మేనేజిమెంట్ సభ్యుడు కొండా హరిరామ కృష్ణంరాజు, హెచ్‌ఓడీ కేవీ శ్రీధర్, కోఆర్డినేటర్లు ఎస్ సతీష్, ఎస్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	36	బీన్ల చిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	44-48
బెండకాయలు	44	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	30	కంద	72
కాకర కాయలు	36	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	52
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – తిరుపతి	16.0	4830	34